RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 276 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, మే,1, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 276 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, May, 1, 2026 | PAGES : 8 RS : 4 /- |





## ఆమె వేదనను.. ఏదీ పూడ్చలేదు

15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో కేంద్రంపై

## సుప్రీంకోర్టు ఆగ్రహం

- ఆమె పడిన వేదనను ఏదీ భర్తీ చేయలేదని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య
- కోర్టు తీర్పును సవాలు చేసే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టీకరణ
- బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇవ్వాలన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన కోర్టు
- పౌరుల వ్యక్తిగత అభిప్రాయాలను గౌరవించాలని ప్రభుత్వానికి సూచన

డిల్లీ: అత్యాచారానికి గురైన 15 ఏళ్ల బాలిక 31 వారాల గర్భాన్ని తొలగించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిపై నిప్పులు చెరిగారు. "అత్యాచారం తర్వాత ఆమె (బాధితురాలు) పడిన వేదనను ఏదీ భర్తీ చేయలేదు. మేడమ్, ముందు పౌరులను గౌరవించడం నేర్చుకోండి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం

## కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

డిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి కి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని, ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0 లో మాట్లాడుతూ కేంద్ర మంత్రిఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సింధూర్ ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ అని, ఇందులో మన త్రివిధ దళాలుసమన్వయంతోముందుకువెళ్లాయని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి సరైన సమయంలోనే దాన్ని ముగించామని, అది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని అన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్

**కొత్త డీజీపీగా బాధ్యతలను స్వీకరించిన సీవీ ఆనంద్**
**కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ**
**శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని సీఎంకు హామీ**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకం ఉంచి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించారు. ప్రజల కు రక్షణ కల్పించడంలో, శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని ఆయన సీఎంకు హామీ ఇచ్చారు. మరోవైపు, ఈరోజు డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. చీఫ్ సెక్రటరీకి సమాన హోదాలో ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. ప్రతి నెల ఆయన రూ. 2.25 లక్షల వేతనం అందుకుంటారు. ప్రత్యేక కార్యాల యంతో పాటు ఎన్నో సదుపాయాలు ఆయనకు ఉంటాయి.



## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్**
**అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి**
**కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం**

**హైదరాబాద్‌కరీంనగర్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు.



## నేనసలే మంచి వాడిని కాను

**ఇరాను అణు ఒప్పందానికి రావాల్సిందే**
**అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు**
**మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్, ఏప్రిల్30 :దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు.




హైదరాబాద్,తెలంగాణ దిశ : కల్వకుంట్ల కుటుంబంలో వారసత్వ పోరు ఇప్పుడు కీలకదశకు చేరుతుంది. కేసీఆర్ వారసులలో ఎవరు సమర్థులు కేటీఆర్ నా..కవితనా?. కేటీఆర్.. మగపిల్లాడే వారసుడు అనే అడ్వాంటేజ్ తీసుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిపోయారు. ఆయన నాయకత్వాన్ని మొదట కవిత కూడా అంగీకరించారు. కానీ తనకు అసలు రాజకీయ భవిష్యత్తే లేకుండా చేయాలనుకోవడంతో కవిత తన దారి తాను చూసుకున్నారు. ఆమె సొంత రాజకీయాలు ప్రారంభించడం తో నిజంగా ఇద్దరిలో ఎవరు రాజకీయంగా సమర్థులు అనే ప్రశ్న వస్తోం ది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని గాడిలో పెట్టడంలో కేటీఆర్ ఆశించిన స్థాయిలో సఫలం కాలేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, పార్టీ నుంచి కీలక నేతల వలసలు ఆయన నాయకత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి.

## మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు..!

**నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్ బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు.



## బెంగాల్ లో మార్పు ఖాయమేనా..?

కోల్ కత్తా, ఏప్రిల్ 30, : వెస్ట్ బెంగాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఎక్కడ కూడా అధికార టిఎంసి నేతల్లో ఉత్సాహం కనిపించలేదు. కనీసం వారిలో గెలుస్తామని ఆశ కూడా కనిపించలేదు. దీనిని బట్టి అక్కడ బిజెపి హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఎంసీ నాయకులు ప్రతిసారి దూకుడు కొనసాగిస్తుంటారు.. ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తుంటారు. అవసరమైతే హింసకు కూడా వెనుకాడరు. ప్రాణాలను కూడా తీస్తారు. ఎందుకంటే అది మమత రాసిన రాజ్యాంగం.. మమత బెనర్జీ గత 15 సంవత్సరాలుగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో రూపొందించిన తన మార్క్ న్యాయం. అవినీతి అక్కడ నిత్య కృత్యం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులకు అది సురక్షితమైన షెల్టర్.. మమత బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి అద్భుతంగా అండదండలు లభించాయి. చివరికి ఆధార్ కార్డులు.. ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందాయి. దీంతో మమత పార్టీ కి దండిగా ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.కేంద్ర ఎన్నికల సంఘం అక్రమంగా నమోదైన ఓటర్లను ఏరి వేసే కార్యక్రమం చేపట్టింది.. దీంతో చాలామంది అక్రమార్కులు తమ ఓటు హక్కును కోల్పోయారు. ఇది ఒక రకంగా మమతకు గట్టి ఎదురు దెబ్బ. అయితే ఈసారి ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సందర్భంలోనూ మమతకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో తిరుగులేని స్ట్రాటజీని పాటించింది.



## వి. హనుమంతరావుకు కీలక పదవి

**- బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరా వు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బీసీ వర్గాల గళంగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వి. హనుమంతరావు గారిని రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో నియమించారు. దీని ప్రకారం ఆయనకు నెలకు రూ. 1,00,000వేతనం అందనుంది. ఒకవేళ ప్రభుత్వ నివాసం కేటాయించకపోతే రూ. 50,000 ఇంటి అద్దె భత్యం పొందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, కల్పించారు.

### తెలంగాణ టెట్ పోటీ పరీక్షపై

# టి-సాట్ స్పెషల్ లైవ్




**హైదరాబాద్, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలలో నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పై అవగాహన కల్పించేందు కు టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. మే నెల ఒకటవ తేది శుక్రవారం ఉదయం 11 గంటలకు మ్యాథమెటిక్స్, ఎన్విరాన్ మెం టల్ స్టడీస్, చైల్డ్ డెవెలప్ మెంట్ అండ్ పెడగాజి, సోషల్ స్టడీస్ వంటి నాలుగు సబ్జెక్టులపై అనుభవం కలిగిన ఉపన్యాసకుల చే స్పెషల్ లైవ్ ఏర్పాటు చేశామమని, టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు లైవ్ కార్యక్ర మం ద్వార తమ తమ సందేహాలు తీర్చుకుని సమాధానాలు పొందవచ్చున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ నిర్వహించిందని, ఐదవ సారి జూన్ నెలలో నిర్వహించబోతోందన్నారు..

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అన్ లైన్ ధరఖాస్తు పూర్తి చేసుకుని ఉన్నందున లైవ్ కార్యక్రమం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగ పడు తుందన్నారు.

**ప్రత్యేక డిజిటల్ ప్రసారాలు :**

జూన్ 15వ తేది నుండి 30వ తేది వరకు జరిగే టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు 90 గంటల డిజిటల్ కంటెంట్ ను మే నెల ఒకటవ తేది నుండి జూన్ 14వ తేది వరకు సుమారు 45 రోజులు 180 ఎపిసోడ్స్ ప్రసారం చేయను న్నామని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

అరగంట నిడివిగల పాఠ్యాంశాలు విద్య ఛానల్ లో ఉదయం ఎనిమిది నుండి పది గంటల వరకు, అవే పాఠ్యాంశాలు నిపుణ ఛానల్ లో సాయంత్రం ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు పున: ప్రసారమౌతాయని సీఈవో వివరించారు. ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ కంటెంట్ టి-సాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యూట్యూబ్, యాప్ లోనూ అందుబాటులో ఉంటాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

### ఆధ్యాత్మిక వైభవం.. పరవశింపజేసిన

# కూచిపూడి నృత్యాలు...





**కుషాయిగూడ, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడడివిజన్ పరిధిలోని ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లాయి. సంప్రదాయ కళారూపాల ద్వారా పురాణ ఇతిహాసాలను కళ్లకు కట్టినట్లు వివరించడం విశేషం. నక్షత్ర నాట్య నిలయం ఆధ్వర్యంలో, ప్రముఖ నృత్య గురువు అంకం శిరీష నేతృత్వంలో ఈనృత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కళాకారులు తమ అద్భుత హావభావాలు, నైపుణ్యంతో గణపతి హోమం ప్రాశిస్త్యాన్ని, ఆంజనేయ స్వామి మహిమలను చాటిచెప్పారు. తాళలయ సమన్వయంతో సాగిన కదలికలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆలయ ప్రాంగణమంతా భక్తిమయ వాతావరణంతో ఉత్సవ శోభను సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం కళాకారుల ప్రతిభను గుర్తించి వారిని ఘనంగా అభినందించారు. విగ్రహ ప్రతిష్టా సమయంలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఆధ్యాత్మికతతో పాటు మన సంప్రదాయాలపై గౌరవం పెరుగుతుందని స్థానిక భక్తులు అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో స్థానిక నేతలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భక్తి పరవశంలో మునిగిపోయారు.

# ఇంధన భద్రతపై భారత్ దృష్టి

### గ్రీన్ ఉనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు

న్యూఢిల్లీ, : ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రా మిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైం ది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. గ్రి÷నైరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

# ఫ్యాన్ కిందకు ఆమంచి

**ఒంగోలు,తెలంగాణ దిశ :** వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో గెలవాల్సిన ఎన్నికలు అవి. లేకుంటే పార్టీకి గడ్డు పరిస్థితులు తప్పవు. అందుకే సర్వశక్తులు ఒడ్డుతోంది ఆపార్టీ. గెలుపు గుర్రాలను వెతికే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. గెలిచే ఛాన్స్ ఉన్నవారికి టికెట్లు ఇవ్వాలని భావిస్తున్నారు. అందుకే వివిధ కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వారికి తిరిగి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ నేతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రకాశం జిల్లా రాజకీయాలు ఒక మలుపు తిరిగినట్టే. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కు వైసీపీలోకి వచ్చేందుకు అనుమతి లభించినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఆయన చీరాల నియోజకవర్గంలో పర్యటనలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఆమంచి కృష్ణమోహన్ ది ప్రత్యేక స్థానం. ఒక సాధారణ జడ్పిటిసిగా ఉన్న ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మరోసారి ఇండిపెండెంట్గా పోటీ చేసి ప్రధాన పార్టీ అభ్యర్థులకు ఓడించి మరి ఎమ్మెల్యే అయ్యారు. ప్రధానంగా చీరాల నియోజకవ ర్గంలో ఆమంచి కృష్ణమోహన్ కు పట్టు ఎక్కువ. బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన జడ్పిటిసిగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. రోశయ్య ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణించగలిగారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలోకి.. వైసీపీ నుంచి టీడీపీలోకి.. అక్కడ నుంచి కాంగ్రెస్లో చేరారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. షర్మిల పక్కన కనిపించే ఆమం చి కృష్ణమోహన్ ఇటీవల కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరమయ్యారు. తన అనుచరులతో తరచూ చేరాలని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు.ప్రస్తుతం చీరాల నియోజకవర్గ ఇన్చార్జిగా కరణం బలరాం కుమారుడు వెంకటేష్ ఉన్నారు. అయితే వారు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో తనకంటూ పట్టు నిలుపుకుంటూ వచ్చారు ఆమంచి కృష్ణమోహన్. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచిన ఆయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సభ్యుడిగా కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే చంద్రబాబు అనూహ్యంగా కరణం బలరామును చీరాల అభ్యర్థిగా ప్రకటించారు.

# ఐజీ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**చర్లపల్లి, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీలో పర్యటించారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న పైకప్పుల లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, భవనాల స్లాబ్ పగుళ్లు వంటి తీవ్రమైన ఇబ్బందులను ఆయన గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ఐజీ కాలనీని ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండాశాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవా...?


**జవహర్ నగర్, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ)**:కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కేసీఆర్ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న సంతోష్ నగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవహర్ నగర్ పరిధిలో పలు చోట్ల నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దెబ్బతింటుందని అన్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవడంలో విఫలమవు తున్నాయని వారు విమర్శిస్తున్నారు.



అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై చర్యలు చేపట్టి చట్టబద్ధమైన విధానాలను అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హరి నామస్మరణతో మారుమ్రోగిన

### శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం



**కీసర, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ)** :శ్రీనృసింహ జయంతి సందర్భంగా శుక్రవారంశ్రీశ్రీశ్రీ చీర్యాలలక్ష్మీనృసింహ స్వామి దేవాలయం హరి నామస్మరణతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా ఉదయం పంచామృత నవకలశాభిషేకం,స్వామివా రికి ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయ ణ చేతుల మీదుగాతులసి లక్ష పుష్పార్చన సప్త హారతులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ముక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి పాల్గొన్నారు.

# పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**నాగారం, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ):**

నాగారం డివిజన్‌లో వివిధ దశలలోఉన్న అభివృద్ధి పనులకోసం రూ. 25 కోట్ల పనులను సాధ్యమైన ంత తొందరగా పూర్తి చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి శుక్రవారం కాంగ్రెస్ నేతలు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, సుమిత్ర సురేష్, మాజీ ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాగారం 16వ వార్డు అధ్యక్షులు మాజేటి వేణు గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.



# కుషాయిగూడలో ఘనంగా ఔషదీ యుక్త మహా స్నాపనం



**కుషాయిగూడ, ఏప్రిల్ 30, (తెలంగాణ దిశ) :**

కుషాయిగూడలో శుక్రవారం 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. స్థాపిత దేవతార్చన, స్థాపిత దేవత (మన్యు సూక్త) హోమాలు, ఔషదీ యుక్త మహా స్నాపనం, ధ్యానాది వాసం, హారతి, సుదర్శన హోమం కార్యక్రమాలను బ్రహ్మశ్రీ ఆర్. శివ కార్తీక్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో సుమారు 19 జంటలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ సహకారంతో వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆంజనేయ స్వామి మాలలు ధరించి నిష్ఠతో పూజలు నిర్వహించారు.



## సంపాదకీయం

# పొంచి ఉన్న కరువు పరిస్థితులు..!

గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీట మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే. 2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకుముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి.

# భారతీయ టెకీలపై పెరుగుతున్న ద్వేషభావం!

## - చోరబాటుదారులు, దొంగలు అంటూ ఆరోపణలు..?



న్యూఢిల్లీ:డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండొవసారి ఎన్నికైన తరువాత ఆ దేశంలో భారత టోకీలపై ద్వేష భావం తీవ్రంగా పెరిగిపోతోంది. వాస్తవంగా మన దేశానికి చెందిన టెకీలు అమెరికాకు అందిస్తున్న సాంకేతిక సేవలు ఎనలేనివి. అయితే అమెరికా సంస్థలలో ఉన్నత స్థానాలలో ఉంటూ. సిలికాన్ వ్యాలీలో ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్న భారతీయ టెకీలు ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం నుంచి దాడిని ఎదుర్కొంటున్నారు. ట్రంప్ తన మద్దతుదారులను సంతోషపెట్టే ప్రయత్నంలో భారతీయ ఇంజినీర్లు, కోడర్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. వారు అమెరికాలో ప్రవేశించేందుకు ఉపకరించిన హెచ్-1బి వీసా పథకం నేడు అసాధారణ శల్యపరీక్షకు గురవుతోంది. కొత్తగా హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసే వారు లక్ష డాలర్ల ఫీజు సమర్పించుకోవాల్సి వస్తోంది. పైగా వారి సోషల్ మీడియా ఖాతాలపై తీవ్రమైన నిఘా పెడుతున్నారు. ఇక జాత్యాహంకార ధోరణులు సరేసరి. ఇలా వారు దాటాల్సిన అడ్డంకులు ఎన్నో ఉంటున్నాయి. భారతీయులు తమ ఉద్యోగాలను లాక్కుంటున్నారన్న భయం అమెరికాలో తీవ్రంగా పెరిగిపోయింది. అమెరికాలో వలస వ్యతిరేక ధోరణులు ప్రబలిపోయాయి. భారతీయులపై జాత్యాహంకారం కూడా పెరిగింది. రాబోయే సంవత్సరంలో భారతీయులను, హిందూ దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరగవచ్చునని క్రిస్మస్ సందర్భంగా అమెరికా పాత్రికేయుడు మాట్ ఫోర్నీ బాహాటంగానే హెచ్చరించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులందరినీ స్వదేశానికి పంపే అవకాశం ఉన్నదని కూడా ఆయన తెలిపారు.

**ప్రబలుతున్న జాత్యాహంకార ధోరణులు:** భారతీయ టెకీలకు వ్యతిరేకంగా మాగా ఉద్యమకారులు చేస్తున్న వాదనలు ఎలా ఉన్నాయంటే. భారత టెకీలు అమెరికన్ల ఉద్యోగాలను దొంగిలిస్తున్నారట. మనలో నైపుణ్యం తక్కువగా ఉంటుందట. అసలు హెచ్-1బి వీసా పథకమే ఓ కుంభకోణమట. అమెరికాలో భారతీయులు లేదా భారత సంతతికి చెందిన వారికి వ్యతిరేకంగా జాత్యాహంకారం బాగా పెరిగిపోయింది. హెచ్-1బి వీసా పథకంలో చేసిన మార్పులు అక్కడ భారతీయులకు ఉన్న స్థానమేమిటో చెబుతున్నాయి. మన టెకీల పైన్న ఉన్న ద్వేష భావం క్రమేపీ ప్రధాన స్రవంతిలో ప్రవేశించింది.

ప్రభావవంతమైన భారతీయ అమెరికన్లు సైతం లక్ష్యంగా మారిపోయారు. హెచ్-1బి వీసా పథకంలో చేసిన మార్పులు భారతీయుల పరిస్థితిని మరింత దుర్భరంగా మార్చేశాయని న్యూయార్క్ పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెకీల భవిష్యత్తు వ్యక్తిగత పనితీరు, భాగస్వామ్యం కంటే విధానపరంగా జరిగే మార్పులపై ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపారు. అధిక జీతం పొందుతున్న వారిని ప్రోత్సహించడం, చౌకగా లభించే ఉద్యోగులను నిరుత్సాహపరచడం వంటి మార్పులను ఆయన ఉదహరించారు.

**ప్రముఖులను సైతం వదలడం లేదు:** చివరికి పరిస్థితి ఎలా తయారైందంటే అమెరికా సంస్థల తమ వద్ద పనిచేస్తున్న భారతీయ టెకీల గుర్తింపును గోప్యంగా ఉంచాల్సి వస్తోంది. దీపావళి పండుగ శుభాకాంక్షలు చెప్పే విషయంలో కూడా ద్వేషభావం స్పష్టంగా కన్పించింది. అమెరికన్లు లక్ష్యంగా చేసుకున్నది కేవలం హెచ్-1బి వీసా హెూల్డర్లనే కాదు. ఎఫ్బిఐ చీఫ్ కష్ పటేల్, రాజకీయవేత్త, దౌత్యవేత్త నిక్కీ హేలీ వంటి ప్రముఖులను కూడా స్వదేశానికి వెళ్లిపోవాల్సిందిగా వందలాది శ్వేతజాతి ఆధిపత్య ఖాతాలు సూచించాయి. గత దశాబ్ద కాలంలో ఆన్లైన్లో భారతీయులపై విద్వేష భావన బాగా పెరిగిపోయిందని పరిశోధకులు గుర్తించారు. భారతీయులను చొరబాటుదారులుగా, ఉద్యోగాల దొంగలుగా చిత్రించే పోస్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

# జంట నీరు సురక్షితమేనా?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జలమండలి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, నిర్వాహణలోపం కారణంగా జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నీరు కలుషితం అవుతోందంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మహానగరానికి సరఫరా అయ్యే తాగునీరు సురక్షితమైనదేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతనెల ఓ ట్యాంకర్‌తో సెప్టిక్ వ్యర్థాలను గండిపేట జలాశయంలో పారయబోయడం కలకలం రేపింది. ఈసంఘటనతో నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మనం నిత్యం తాగే నీళ్లలో సెప్టిక్ వ్యర్థాలు కలుస్తున్నాయా? అని ఆందోళనకు గురయ్యారు. పటిష్టమైన వ్యవస్థను కలిగి ఉండి, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు జలమండలి శివారు జిల్లాల్లో కూడా విస్తరించి ఉంది. ఇంతపెద్ద నెట్‌వర్క్ ఉన్నప్పటికీ జంట జలాశయాల్లోకి వ్యర్థాల డంపింగ్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం జలమండలితో పాటు విజిలెన్స్ అధికారుల నిఘా ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యక్తులు యథేచ్ఛగా సెప్టిక్ వ్యర్థాలను జలాశయాల్లో పారబోస్తున్నారంటే నిఘా వ్యవస్థ నిర్లక్ష్యం స్పష్టమవు తోంది. అదేవిధంగా గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ దాకా 14 కిలో మీటర్లున్న కాండ్యూట్ నీరు కూడా అక్కడక్కడా కలుషితమవుతున్నది. కాండ్యూట్‌లో కొనిచోట్ల పైకప్పులుగా ఉంచిన రాళ్ల మధ్య గ్యాప్‌లు ఏర్పడి దానిపైన చెత్త పారబోస్తుం డటంతో నీరు కలుషితమవుతున్నది. జంట జలాశయాల్లో సెప్టిక్ వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాల పారబోసిన ఘటనలు మునుపెన్నడూ వెలుగులోకి రాలేదు. ఇటీవల జరిగిన ఘటనతో జలమండలి అధికారులు, సిబ్బంది పనితీరుపై సందేహాలు కలుగుతున్నాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు ఇద్దరు జలమండలి సిబ్బంది, ఒక గార్డు చొప్పున పెట్రోలింగ్ నిర్వహిస్తారు. వీరు ఉదయం 10 గంటలకు విధుల్లోకి వచ్చి సాయంత్రం దాకా పెట్రోలింగ్ నిర్వహిస్తారని అధికారులు చెప్తున్నారు. సెప్టిక్ ట్యాంకర్ ఓనర్లు ఇదే అదనుగా తెల్లవారుజాము(ఉదయం 5గంటల) నుంచి ట్యాంకర్ల ద్వారా సెప్టిక్ వ్యర్థాలను జలాశయాల్లోకి వదులుతున్నట్లు సమాచారం. గతనెల 17న కూడా శివనాయక్ అనే వ్యక్తి ఉదయం 8 గంటలకు సెప్టిక్ వ్యర్థాలను ఉస్మాన్‌సాగర్ జలాశయంలో పారబోసేందుకు ప్రయత్నించాడు. జలమండలి సిబ్బంది ఉదయం 10 గంటలకు విధుల్లోకి వస్తుండటంతో అప్పటికే అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నట్లు తెలుస్తున్నది. నగర ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించే నీటిలో సెప్టిక్ వ్యర్థాలు, గృహ వ్యర్థాలను కలవనీయకుండా ఉండాలంటే జలమండలి నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికైనా పెట్రోలింగ్‌కు మరింత మందిని నియమించి షిఫ్టుల వారీగా నిఘా ఉంచాలని నగరప్రజలు కోరుతున్నారు.

**ఉస్మాన్‌సాగర్‌లోకి యథేచ్ఛగా గృహ వ్యర్థాలు..:** జంట జలాశయాల్లో ఒకటైన ఉస్మాన్‌సాగర్‌లో పరీవాహక ప్రాంతాల ప్రజలు.. గృహవ్యర్థాలతో పాటు చెత్తను బస్తాలు, పాలిథిన్ కవర్లలో తీసుకొచ్చి జలాశయంలో పారబోస్తున్నారు. దీంతో జలాశయం చుట్టూ చెత్త కుప్పలుగా పేరుకుపోతున్నది. దీంతో తాగునీరు కలుషితం అవుతున్నది. అదేవిధంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. దీంతో ఆ వ్యర్థాలు కుళ్లిపోయి నీరు కలుషితమవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నది. కొన్నిచోట్ల గృహ వ్యర్థాలతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలు విచ్చలవిడిగా పడేస్తున్నారు. జంట జలాశయాల చుట్టూ ఫంక్షన్ హాళ్లు, రిసార్ట్స్ ఉండటంతో వాటిల్లో ఫంక్షన్లు, వేడుకల కోసం ఏర్పాటు చేసిన అలంకరణ వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. ఎవరుపడితే వారు చెత్తను జలాశయాల్లో పడేసి కలుషితం చేస్తున్నారు. నగరంలోని ప్రజలకు మంచినీటిని అందించే జలవనరులను సంరక్షించాల్సిన జలమండలి అధికారులు మేల్కొని నీటిని కలుషితం కాకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# వల్లభనేని వంశీ మళ్లీ గాయబ్..!


**విజయవాడ,తెలంగాణ దిశ :** సామాన్యుడికి కేసులు, కోర్టులు అంటే భయం. ఎందుకంటే మంచి భవిష్యత్తు పోతుంది.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ రాజకీయ పార్టీల నేతలకు అలా కాదు. వారికి కేసులు అనేవి కామన్. జైలు జీవితం అనేది సర్వసాధారణం. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పరారీ అయినట్లు వార్తలు వస్తున్నాయి.. ఓ కేసు విషయంలో ఆయనకు అరెస్టు తప్పదని ప్రచారం నడుస్తోంది. తన కార్యాలయం వద్ద ఆందోళన చేసిన టిడిపి కార్యకర్త పై దాడి చేశారన్న ఫిర్యాదు పై ఆయనను అరెస్టు చేస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇప్పుడు ఆయనతో పాటు అనుచరులు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అందులో ఎంత నిజం ఉందో చూడాలి. 2019లో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫిరాయించారు వల్లభనేని వంశీ మోహన్. ఆ సమయంలో ఆయన కేవలం చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడడానికే అన్నట్టు ఉండేవారు. కేవలం దానికోసమే ఆయనను వైసీపీలోకి రప్పించినట్లు అప్పట్లో వ్యవహారం నడిచేది. నోటికి ఎంత వస్తే అంత మాట అనేవారు వల్లభనేని వంశీ మోహన్. ఒకానొక దశలో చంద్రబాబు సతీమణి కోసం కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు లోకేష్. రెడ్ బుక్ లో అందరి పేర్లు రాస్తున్నానని.. తప్పకుండా అందరిపై చర్యలు ఉంటాయని అప్పట్లో హెచ్చరించారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వల్లభనేని వంశీ మోహన్ విషయంలో పెద్దగా కలుగ చేసుకోలేదు. అయితే వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి జరిగింది.

అప్పటి కేసును ఉపసంహరించుకోవాలని కోరుతూ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ పై ఒత్తిడి చేశారు వల్లభనేని వంశీ మోహన్. బాధితుడు ఫిర్యాదుతో ఆ కేసు మళ్లీ మొదలైంది. అలా ఒక్కో కేసు వల్లభనేని వంశీ మోహన్ మెడకు చుట్టుకుంది. దాదాపు 5 నెలలకు పైగా రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు వల్లభనేని వంశీ మోహన్. పలుమార్లు జైలులో అస్వస్థతకు కూడా గురయ్యారు. అయితే బెయిల్ పై బయటకు వచ్చిన ఆయన అనారోగ్యానికి గురి కావడంతో కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకున్నారు. ఇటీవల రాజకీయ పరామర్శలు చేస్తున్నారు. పొలిటికల్ గా యాక్టివ్ అవుతున్నారు.అయితే ఇప్పుడు మరోసారి వల్లభనేని వంశీ అరెస్ట్ జరుగుతుందని ప్రచారం నడిచింది. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో తెలుగుదేశం పార్టీ ఒక నిరసన కార్యక్రమం చేసింది.

వల్లభనేని వంశీ మోహన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఓ టిడిపి కార్యకర్తపై అనుచరులతో దాడి చేయించారన్నది ఆయనపై వచ్చిన అభియోగం. ఎప్పుడో నెలల కిందట వచ్చిన ఫిర్యాదు పై ఇప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు సిద్ధపడ్డారు. దీంతో వల్లభనేని వంశీ మోహన్ తో పాటు ఆయన అనుచరులు కనిపించకుండా మానేశారు. అప్పటినుంచి వల్లభనేని వంశీ మోహన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు ప్రచారం జరిగింది.

కానీ ఆయన ముందస్తు బెయిల్ కోసం అలా చేసి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి కేసులు ఎదుర్కొని బెయిల్ పై బయటకు వచ్చాక అంత ఈజీగా మళ్లీ జీవితం ఉండదని చెబుతున్నారు. ఎందుకంటే అంతకు ముందు కేసుల్లో బెయిల్ తీర్పులను ఆధారంగా చేసుకుని న్యాయపరంగా ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. కేవలం కోర్టు నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తారే తప్ప అజ్ఞాతంలోకి వెళ్లారన్నది మెజారిటీ విశ్లేషకుల అభిప్రాయం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

# వాయిదా వేద్దాం..



ప్రస్తుత డిజిటల్ యుగంలో.. చాలామంది స్మార్ట్‌ఫోనే ప్రపంచంగా బతికేస్తున్నారు. ఉదయం లేవగానే.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుంటున్నారు. మంచం మీదినుంచే.. సోషల్ మీడియా మెసేజ్‌లు, తాజా వార్తల ను తనిఖీ చేస్తున్నారు. అయితే, ఈ అలవాటు మెదడు పనితీరుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సైంటిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే ఫోన్‌లో తలదూర్చడం వల్ల.. ఆలోచనా విధానం, సృజనాత్మక సామర్థ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. ఉదయం మేల్కొన్న తర్వాతి మొదటి 15-20 నిమిషాలు మెదడుకు చాలా ముఖ్యమైన సమయం. అప్పుడే మెదడు 'పీక్ న్యూరోప్లాస్టిక్ మోడ్'లోకి ప్రవేశిస్తుంది. అంటే.. ఏదైనా నేర్చుకోవడానికి, మార్పులను స్వీకరించడానికి మెదడుకు ఉండే సామర్థ్యం. రాత్రంతా నిద్రలో ఉండి.. ఉదయాన్నే మేల్కొన్నప్పుడు ఈ సామర్థ్యం అత్యధిక స్థాయిలో ఉంటుందట. కాబట్టి, ఏదైనా ప్రేరణ కలగడానికి, దృష్టిని మెరుగుపరుచుకోవడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, సృజనాత్మకంగా ఉండటానికి.. మెదడుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ఆ సమయంలో ఫోన్‌తో గడపడం వల్ల.. మెదడు సృజనాత్మక ఆలోచనలపై ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా.. ఉదయాన్నే ఏదైనా ఇబ్బందికర సమాచారం, వార్తల గురించి విన్నప్పుడు మెదడు 'హై అలర్ట్' మోడ్‌లోకి వెళ్తుందట. మంచం మీదినుంచి లేవడానికి ముందే.. మెదడులో ఆందోళన, ఒత్తిడి పెరుగుతుందట. దీనిని నివారించడానికి '20 నిమిషాల ట్రిక్'ను అనుసరించాలని చెబుతున్నారు. నిద్ర లేచిన వెంటనే కాకుండా ఫోన్‌ను చూడటాన్ని 20 నిమిషాలు ఆలస్యం చేయాలని చెబుతున్నారు. మొదటి 20 నిమిషాలు ప్రశాంతంగా, సానుకూలంగా ఏదో ఒక పనిచేయాలని సూచిస్తున్నారు. చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌లు చేయడం, రోజువారీ చేయాల్సిన పనుల లిస్ట్‌ను తయారు చేసుకోవడం, ప్రధాన లక్ష్యాల గురించి ఆలోచించడం చేయాలని అంటున్నారు. ఈ చిన్న మార్పు.. మెదడుపై సానుకూల ప్రభావం చూపుతుందనీ, ఏకాగ్రత, సంతోషం పెరుగుతాయనీ చెబుతున్నారు.

# వేళ్ల మధ్య దురద, పగుళ్లు ఇలా పోగొట్టుకోండి..



వాతావరణంలో తేమ పెరిగి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వీటిలో సాధారణంగా కనిపించే ఒక సమస్య కాలి వేళ్ళ మధ్య ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా పాదం పగు ళ్లు. దీనివల్ల చాలాసార్లు కాలి వేళ్ళ మధ్య విపరీతమైన దురద వస్తుంది, చర్మం పగులుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే చాలు.


ఆవాల నూనె, వెల్లుల్లి : 2-3 వెల్లుల్లి రెబ్బలను ఆవాల నూనెలో వేసి వేడి చేయాలి. చల్లారిన తర్వాత ఈ నూనెను కాలి వేళ్ళ మధ్య రాయాలి. ఆవాలు, వెల్లుల్లిలో ఉండే యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు పగుళ్లను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి. ఈ పద్ధతిని సాధారణంగా చాలా మంది ఉపయోగిస్తారు.

రావి చెట్టు బెరడు నీరు : రావిచెట్టు ఎండుబెరడునునీటిలో మరిగించాలి. ఆ గోరువెచ్చని నీటితో రోజుకు రెండుసార్లు 10-15 నిమిషాల పాటు పాదాలను కడగాలి. రావి బెరడులో యాంటీసెప్టిక్ గుణాలు ఉంటాయి, ఇవి గాయాలను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి.

పసుపు, కొబ్బరి నూనె : 1 చెంచా పసుపులో కొద్దిగా కొబ్బరి నూనె కలిపి పేస్ట్‌గా చేసి, పగుళ్లు లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్న చోట రోజుకు రెండుసార్లు రాయాలి. పసుపు ఇన్‌ఫెక్షన్లను తొలగిస్తుంది కొబ్బరి నూనె తేమను అందించి చర్మం పొడిగా మారకుండా చూస్తుంది.

వేప ఆకుల మరిగించిన నీరు : 10-15 వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటితో రోజుకు రెండుసార్లు పాదాలను కడగాలి. వేపకు శక్తివంతమైన యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ గుణాలు ఉన్నాయి, ఇవి చర్మ సమస్యలను దూరం చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి.

# లక్షణాలు గుర్తిస్తే.. ప్రమాదం దూరం



క్యాన్సర్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా క్యాన్సర్ మహమ్మారి అందర్నీ ప్రమాదంలోకి నెట్టేస్తున్నది. అయితే క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాన్ని తగ్గించొచ్చు. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడి, సాధారణ జీవితం గడపొచ్చు. చాలామంది క్యాన్సర్ లక్షణాలపై అవగాహన లేక సమస్యను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ పది లక్షణాలను గమనించి, వెంటనే వైద్యుణ్ని సంప్రదిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చు.

అకస్మాత్తుగా బరువు తగ్గడం: ఒకే నెలలో నాలుగైదు కిలోలు తగ్గుతున్నారంటే జాగ్రత్త పడాలి. కిలోల కొద్దీ బరువు ఒకేసారి తగ్గితే, అది కడుపు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ లక్షణం కావచ్చు.

ఎక్కువ అలసట: చిన్నచిన్న పనులకే ఎక్కువగా అలసిపోతున్నా, అది క్యాన్సర్ లక్షణం కావచ్చు. లుకేమియా లేదా లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్లలో కూడా ఈ లక్షణం ఉంటుంది.

కణుతులు: మెడ, చంక మొదలైన చోట్ల కొత్తగా గడ్డలు కనిపించినా, లేదాచిన్న గడ్డలుగట్టిపడినా,పెద్దగాపెరిగినా వెంటనేడాక్టర్‌ను సంప్రదించాలి. అదిరొమ్ము,వృషణాలు,శోషరస సంబంధితక్యాన్సర్ కావచ్చు. చర్మం-పుట్టుమచ్చల్లో మార్పు: కొత్త పుట్టుమచ్చలు పుట్టుకురావడం, పాత మచ్చల రంగు, పరిమాణంలో మార్పులు, వాటిలోంచి రక్తం రావడం లాంటివి క్యాన్సర్ లక్షణాలుగా చెబుతారు. అందుకే చర్మ సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దు.

బ్లీడింగ్ ప్రమాదమే: మూత్రం, మలం, వాంతి, దగ్గులో రక్తం కనిపిస్తే, వెంటనే అప్రమత్తం అవ్వాలి. అవన్నీ మూత్రాశయ, పెద్దపేగు, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి.

ఆగని దగ్గు: వారాలు గడిచినా దగ్గు తగ్గకుండా, రక్తం పడుతున్నట్లయితే అది కేవలం ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. గొంతు, ఊపిరితిత్తులు, థైరాయిడ్ క్యాన్సర్‌కు సూచన అనుకొని జాగ్రత్తపడటం మంచిది.

అజీర్తి-మింగడంలోఇబ్బంది: ఆహారం మింగడంలో ఇబ్బందిగా ఉన్నా,ఛాతీలోమంట, అజీర్తి సమస్యలుదీర్ఘకాలంగా ఉంటే,వెంటనే అప్ర మత్తం అవ్వాలి.అది గొంతు,కడుపు,అన్నవాహికక్యాన్సర్‌కు దారితీయొచ్చు.

విసర్జన వేళల్లో మార్పులు: మల విసర్జన సమయాల్లో మార్పులు, అతిసారం, మలబద్ధకం, మలంలో రక్తం, మూత్రంలో మంట మొదలైనవి మూత్రాశయ, పెద్దపేగు, వీర్యగ్రంథి క్యాన్సర్ లక్షణాలు. వీటిలో ఏవి ఎక్కువ రోజులున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

విపరీతమైన నొప్పి: ఎముకలు, క్లోమం, అండాశయాల్లో క్యాన్సర్ ఉన్నప్పుడు.. కడుపు, వీపు లేదా కీళ్లలో నొప్పి విపరీతంగా ఉంటుంది. రోజులు గడిచినా ట్యాబ్లెట్లతో తగ్గకుంటే, వైద్యుణ్ని కలవడం అవసరం.రాత్రుళ్లు చెమటలు: తరచూ జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, వరుసగా ఇన్ఫెక్షన్లు లాంటివి కూడా క్యాన్సర్ లక్షణాలు అయ్యుండొచ్చు. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇవి దీర్ఘకాలం కొనసాగితే మాత్రం జాగ్రత్తపడటం తప్పనిసరి. కీడెంచి మేలెంచడం మంచిది కదా! ఈ తరహా లక్షణాలు వారాల తరబడి అలాగే కొనసాగుతూ ఉంటే.. వైద్యుణ్ని సంప్రదించడం తప్పనిసరి. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోకుండా ఉంటుంది.

# యువతలో గుండెపోటులు ఎందుకు..



హైదరాబాద్, : ఇటీవల ఉప్పల్‌లో ఓ యువకుడు బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనికి కారణం అతడికి సడన్ కార్డియాక్ అరెస్ట్ కావడమే. సికింద్రాబాద్‌కు చెందిన 24ఏళ్ల యువకుడు జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. ఇక్కడా గుండెపోటే కారణం. ఇలా ఇటీవల చాలామంది యువకులు ముఖ్యంగా 30 ఏళ్లలోపే గుండెపోటుకు గురవుతున్నారు. వీటన్నిటికీ కారణాలేంటి? ఈ యువత గుండెకు ఏమైంది. అంత వీక్‌గా మనోళ్లు ఉన్నారా? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశం కానున్నాయి.తమ దగ్గరికి వచ్చే గుండె జబ్బు బాధితుల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హృద్రోగ నిపుణులు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు 50, 60 ఏళ్ల వయసు దాటిన వారిలోనే కనిపించే గుండె జబ్బులు.. ఇప్పుడు 20-30 ఏళ్ల వయసు వారిలోనూ చోటు చేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం, కండరాల వాపు వంటి వాటితో పాటు అంతకుముందు కుటుంబంలో ఎవరికో ఒకరికి ఈ జబ్బులు ఉంటేఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చిన్నప్పటి నుంచే జంక్ ఫుడ్‌ను అధిక మొత్తంలో తీసుకుంటుండటం వల్ల కొవ్వు శాతం పెరిగి గుండె స్పందనల్లో తేడాలొస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయంటున్నారు. ఇక మాదక ద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ గుండె సమస్యలొచ్చే ముప్పు అధికమని అంటున్నారు. అందుకే 25 ఏళ్లు దాటినప్పటి నుంచే గుండె ఆరోగ్యాన్ని తెలిపే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.చిన్న వయసులోనే క్రీడాకారులు ఇలాంటి ఆకస్మిక మరణానికి గురైతే హెచ్‌సీఎం- హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి కారణం అయి ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారిలో గుండె కండరాలు లావుగా ఉంటాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చి ఉంటుంది. వ్యాయామం చేసే సమయంలో గుండె నిమిషానికి 210 సార్లకంటే ఎక్కువగా కొట్టుకోవడం ద్వారా దాని చలనం ఆగిపోయి.. రక్తప్రసరణ జరగకుండా చనిపోతారు. యువకుల్లోనే ఇలాంటివి కనిపిస్తాయి. అథ్లెట్లు, క్రీడాకారులు కొన్ని రకాల స్టెరాయిడ్లు వినియోగించినా కండరాలు అధికంగా సంకోచ వ్యాకోచాలకు గురై ఒక దశలో ఆగిపోయి చనిపోతారు. వ్యాయామానికి ముందు యువకులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. తల్లిదండ్రులకు ఇతర రక్తసంబంధీకులకు గుండెజబ్బులు ఉంటే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.అలాగే మధుమేహం, అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి, కొవ్వు పేరుకుపోయి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. షుగర్ ఉంటే 2 నుంచి 3 రెట్లు ఎక్కువ ముప్పు ఉంటుంది. కొవిడ్ వైరస్ గుండె కండరాలకు వాపు కలిగించవచ్చు. ఇది కూడా గుండె పోటు ప్రమాదాన్ని పెంచవచ్చు. యువతలో గుండెపోటు నివారించడా నికి పండ్లు, కూరగాయలు, చేపలు, చికెన్, తృణధాన్యాల వంటి ఆహారాన్ని తీసుకోవాలంటున్నారు డాక్టర్లు. రోజూ ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తున్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు నడుస్తూనో.. వ్యాయామం చేస్తూనో.. గుండెనొప్పితో కుప్పకూలిపోతు న్నారు. కార్డియాక్ అరెస్టు కావడమే ఇలాంటి ఘటనలకు కారణం.రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉన్నా.. ముందే గుర్తించకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఆహారం ఊపిరితిత్తులకు చేరడం వల్ల రక్తనాళాల్లో అడ్డుపడి మృత్యువాత పడతారు. స్టెరాయిడ్లు వాడకూడదు. చిన్న వ్యాయామాలకైనా.. పరిగెత్తినా అలసటగా ఉంటే వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. సడన్ స్ట్రోక్ వచ్చే వారిలో సగం మంది ఆస్పత్రికి చేరకుండానే మరణిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారు.. అప్పుడు తక్షణ చికిత్స అందిస్తే బాధితుడి కాపాడుకోవచ్చు. సీపీఆర్ చేయడం ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలంటున్నారు వైద్యులు.

# రాత్రి పూట యాలకుల పాలను తాగితే ఎన్నో లాభాలు..



యాలకులు మన వంట ఇంట్లో సుగంధ ద్రవ్యాలుగా ఎప్పటి నుంచో ఉన్నాయి. మసాలా వంటకాల్లో యాలకులను ఎక్కువగా వేస్తుంటారు. చికెన్, మటన్ తోపాటు శాకాహార మసాలా వంటకాలు, స్వీట్లలో యాలకులను ఉపయోగిస్తారు. దీంతో వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే యాలకులను రాత్రి పూట పాలలో మరిగించి ఆ పాలను తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యాలకుల పాలను రోజూ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. యాలకుల పాలను తాగడం వల్ల ట్రిప్టోఫాన్ లభిస్తుంది. ఇది ఒక అమైనో యాసిడ్. నిద్రను ప్రేరేపిస్తుంది. శరీరంలో సెరొటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి ఉన్నవారు రాత్రి పూట యాలకుల పాలను తాగితే ప్రయోజనం ఉంటుంది.

మానసిక ఆరోగ్యానికి..: యాలకుల పాలను తాగడం వల్ల నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి డిప్రెషన్ నుంచి బయట పడతారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా మారి యాక్టివ్ గా ఉంటుంది. మరుసటి రోజు ఉత్తేజంగా పనిచేస్తారు. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. అసిడిటీ, కడుపు నొప్పి ఉన్నవారు ఈ పాలను తాగితే ఎంతగానో ప్రయోజనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. యాలకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో

## కచ్చితంగా రోజూ తాగండి..!

కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

బీపీ తగ్గేందుకు..: యాలకుల్లో పొటాషియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తాయి. యాలకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. యాలకుల పాలను తాగడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షించుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా గుండె పోటు రాకుండా ఉంటుంది. యాలకుల్లో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకుల పాలను సేవిస్తే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

వాపులు, నొప్పులకు..: యాలకుల పాలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ సమస్య తగ్గుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలకుల పాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి, అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మెటబాలిజం పెరిగేలా చేస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఒక కప్పు పాలలో 2 లేదా 3 యాలకులను వేసి బాగా మరిగిస్తే యాలకుల పాలు రెడీ అవుతాయి. కాస్త తేనె కలిపి తాగితే రుచిగా ఉండడమే కాదు, అనేక ప్రయోజనాలను అందిస్తాయి.


# పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలం



ఈ సీజన్‌లో సహజసిద్ధంగా లభించే పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగుల్లో సెలీనియం, విటమిన్ సి, కోలిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు, పుట్టగొడుగుల్లో ప్రోటీన్, బి-కాంప్లెక్స్ విటమిన్లు, ఫైబర్ కూడా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి కణం, కణజాల నష్టాన్ని నిరోధించడంలో సహాయ పడతాయి. రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి. ఇందులో ఉండే విటమిన్ డి ఎముకలు, కీళ్ల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. పుట్టగొడుగుల్లో ఎర్గోస్టెరాల్ అనే 'ప్రోవిటమిన్' ఉంటుంది. ఇవి సూర్యరశ్మికి గురైన తర్వాత విటమిన్ డిగా మారుతుంది. విటమిన్ డి సాంద్రతను పెంచడంలో ఇది సహాయపడుతుంది. పుట్టగొడుగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, బి-కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి.

బీటా-గ్లూకాన్ అనేది పుట్టగొడుగుల్లో సాధారణంగా కనిపించే ఒక కరిగే ఫైబర్. ఈ కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుట్టగొడుగుల్లో గ్లూటాతియోన్, విటమిన్ సి, సెలీనియం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మంపై ముడతలు రాకుండా సహాయపడతాయి.

# సిటీ చుట్టూ రేడియల్ రింగ్



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరో మార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్‌వర్క్‌ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా నగరానికి ఒక్కో వైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్త ప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్‌కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి మళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్‌కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనే మాట వినిపించదు. పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్ల నిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం

**రంగారెడ్డి,తెలంగాణ దిశ :** హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత తో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకా శాలు మెరుగుపడతాయి. మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది.

అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభు త్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరా బాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

# మళ్లీ రేసులోకి ధర్మాన



**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్‌గా మారారు. ఈ మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుం బాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం. ప్రాధాన్యం పెరగడం రాజకీయ ం గా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం.

# బస్సు డ్రైవర్... దేశాధ్యక్షుడు ఎలా అయ్యారు..

న్యూఢిల్లీ: వెనిజుల అధ్యక్షుడిని అమెరికా అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే కాదు, మదురో ను అరెస్ట్ చేసిన ఫోటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అమెరికా సైన్యం విజయవంతమైన పని చేస్తుందని అందులో రాసుకోచ్చారు. మదురో ను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తున్న ఫోటోలు ట్రంప్ పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది. మదురో అరెస్ట్ తర్వాత వెనిజులా ప్రాంతంలో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో అమెరికా ఏం చేస్తుంది? తనకు నచ్చిన వ్యక్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిస్తుందా? ఉన్న ప్రభుత్వాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని.. తోలుబొమ్మ లాగా ఆడిస్తుందా.. ఈ ప్రశ్నలకు మరి కొద్ది రోజుల్లోనే సమాధానాలు లభిస్తాయి. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత అమెరికా సంబరాలు చేసుకుంటున్నది. వాస్తవానికి మదురో ఓవర్ నైట్ లో వెనిజులా దేశానికి అధ్యక్షుడు కాలేదు. అతడు చిన్న స్థాయి నుంచి తన జీవితాన్ని మొదలుపెట్టాడు. ఒక బస్సు డ్రైవర్ గా జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత రాజకీయాలలోకి వచ్చాడు. క్రమ క్రమంగా ఎదిగాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. వెనిజులా అధిపతి హ్యూగో చావేజ్ కు ప్రధాన అనుచరుడిగా మారిపోయారు. ఆ తర్వాత రాజకీయాలలో ఎదిగారు. చావెజ్ కన్ను మూసిన తర్వాత 2013లో వెనిజులా దేశానికి అధ్యక్షుడయ్యారు. అయితే ఆ దేశాన్ని ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. ఇదే క్రమంలో మదురో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. అమెరికాకు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని విమర్శలు వినిపించాయి. చివరికి అమెరికా మాదక ద్రవ్యాలను సాకుగా చూపించి.. వెనిజులా మీద దాడి చేసింది. మదురో ను అరెస్ట్ చేసింది. మదురో మొదటి నుంచి కూడా స్వయం ప్రతిపత్తి కల నాయకుడు. అనేక సందర్భాలలో అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. ఇది సహజంగానే అమెరికాకు కడుపు మంటగా మారిపోయింది. దీంతో సమయం కోసం ఎదురుచూసిన ఆ దేశం. మదురో కు చెక్ పెట్టింది. అనేక విషయాలలో ఆయనకు అడ్డు తగిలింది. చివరికి దేశం మీద దాడి చేసి.. సైన్యాన్ని మోహరించి.. అరెస్టు చేయించింది. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత.. అతడిని అమెరికా తన అదుపులో ఉంచుకుంటుంది. ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టిన తర్వాతనే బయటికి విడుదల చేస్తుందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఒకవేళ విడుదల చేసినా.. సొంత దేశంలో అతడిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి.. కాలగర్భంలో కలిపేలా చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ప్రజాసేవే పరమార్థమైన మహా దాత..!



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపాధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్తవానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు.

అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.

కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొతాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు,

స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు.

తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100ఎకరాల భూమిని దానం చేశారు. .1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు.

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూశాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణ లో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ..ఎసిబి స్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటు న్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయ కులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్ర తినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సంటేజీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను ఆక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు.

నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్ల భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్‌శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటీజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖలో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడు తున్నారు.

# అజరామరం... ఆ గానం!

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతాభ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు.

## మృతిరాలు బాలవ్వ ... బంగారు కమ్మలు మాయం...!



**జగిత్యాల,తెలంగాణ దిశ :** జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంచలన ఘటన వెలుగుచూసింది. మృతదేహం నుంచి బంగారు కమ్మలు మాయమవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు.వివరాల్లోకి వెళ్తే... కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన బాలవ్వ అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూనే ఆమె మృతి చెందింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే, ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తుండగా, బాలవ్వ చెవులకు ఉన్న బంగారు కమ్మలు కనిపించకపోవ డంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆసుపత్రిలోనే అవి మాయం అయ్యాయని అనుమానం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై ఆరోప ణలు గుప్పించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు స్వీకరించారు. మృతదేహం నుంచి ఆభరణాలు మాయం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారిం ది. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. నిజానిజాలు తేలాల్సి ఉంది.

# సింగర్ 200 కోట్ల కథ ఏంటీ..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**సింగర్ మంగ్లీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని పేరు. తన పాటలతో.. పాటంటే మంగ్లీ, మంగ్లీ అంటే పాట అన్నట్లుగా ఎదిగారు. ఊరువాడ తన గొంతుతో ఉర్రూతలూగించిన ఈ జానపద కోకిల, ఇప్పుడు 'నోట్ల' డప్పు కొడుతోందా? స్టేజ్ మీద స్టెప్పులేసే మంగ్లీ, ఇప్పుడు పోలీస్ స్టేషన్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అసలు ఈ 200 కోట్ల కథ ఏంటి? ఎవరిని నమ్మించి ముంచేశారు.? ఈ స్కామ్‌లో నిజంగానే మంగ్లీ పాత్ర ఉందా.?ఒకప్పుడు మంగ్లీ గొంతు వింటే పల్లె పులకరించేది.. కానీ ఇప్పుడు మంగ్లీ పేరు వింటే వివాదాలు పలకరిస్తున్నాయి. తాజాగా 200 కోట్ల స్కామ్ ఆరోపణలు ఆమె చుట్టూ ముసురుకున్నాయి. ఒక విధంగా చెప్పలంటే మంగ్లీ టైమ్ అస్సలు బాలేదు.! మొన్న తిరుమలలో ప్రొటోకాల్ వివాదం.. అంతకుముందు బోనాల పాటలో పదాల గొడవ.. ఆ తర్వాత కాళహస్తిలో డ్యాన్స్ ఇష్యూ. ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఆమెను వెంటాడుతూనే ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒకెత్తు.. ఇప్పుడు వచ్చిన '200 కోట్ల స్కామ్ మరో ఎత్తు. ఇది కేవలం పాటల గొడవ కాదు.. సామాన్యుల జేబులకు పడ్డ కన్నాల గురించి! మంగ్లీ మాట నమ్మి పైసలు పోగొట్టుకున్న బాధితులు, ఇప్పుడు ఆమెపై నిప్పులు చెరుగుతున్నారు.గోకుల నందన్స్ఫ్రా అనే కంపెనీలో మంగ్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. అయితే స్కామ్ జరిగింది కూడా ఇదే కంపెనీ పేరుతో కావడంతో మంగ్లీ కూడా ఈ స్కామ్‌లో ఉన్నారనే ఆరోపణలకు మరింత బలం చేకురింది. కంపెనీలో.. మంగ్లీ కేవలం బ్రాండ్ అంబాసిడర్ మాత్రమేనా? లేక వెనకుండి నడిపించిన డైరెక్టరా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పోలీసులు 10 కోట్లు అంటే.. బాధితులు 200 కోట్లు అంటున్నారు. అంటే ఇక్కడ లెక్కల్లో భారీ మొత్తంలో తేడా కొడుతోంది! మంగ్లీ ఏమో నాకేం తెలీదు.. నేను అమాయకురాలిని అని నార్సింగిలో ఫిర్యాదు చేశారు. పంజాగుట్టలో ఆమెపై కేసు నమోదైతే.. ఆమె వెళ్లి నార్సింగిలో కంప్లైంట్ ఇవ్వడం చూస్తుంటే.. సీన్ చాలా రివర్స్‌లో ఉన్నట్టు కనిపిస్తోంది. తర్వాత మళ్లీ పంజాగుట్టలో కూడా ఫిర్యాదు చేశారనుకోండి అది వేరే విషయం.విషయానికి వస్తే.. అడ్వకేట్ సుబ్బారావు అనే వ్యక్తి మంగ్లీ ఆమె తమ్ముడు శివ, తన స్నేహితులు మధు, భరత్ చౌహాన్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోకుల నందన్స్ఫ్రా సంస్థలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 150 మందికిపైగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వద్దకు వచ్చి బాధితులు మొరపెట్టున్నారని సుబ్బారావు తెలిపారు. ఈ స్కామ్ విలువ సుమారు 200 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని ఫిర్యాదులో చెప్పారు. వాటితో పాటు భరత్ చౌహాన్ డబ్బు కట్టలను లెక్కిస్తున్న వీడియోను కూడా ఆయన రిలీజ్ చేశారు. దీంతో విషయం మరింత రాజుకుంది. ఈ టీమ్ వసూళ్లకి పాల్పడితే మంగ్లీ ప్రమోషన్ చేశారంటూ బాధితులతో కలిసి పోలీసులకు కంప్లయింట్ ఇచ్చారు. మరోవైపు 'మాకు కంపెనీ గురించి తెలియకపోయినా, మంగ్లీని చూసి, ఆమె మాటలు నమ్మి మా కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టాము. ఇప్పుడు కంపెనీ బోర్డు తిప్పేస్తే, ఆమెకు సంబంధం లేదనడం సరికాదు" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతన్నారు.ఈ విషయంపై కాస్త లేటయినా ఘాటుగా రియాక్ట్ అయ్యారు మంగ్లీ. మనీ మ్యాటర్.. లాయర్ ఆరోపణలు.. ఈ రెండింటిని తిప్పికొట్టారు. తన వ్యక్తిత్వానికి భంగం కలిగేలా.. అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయల స్కామ్ అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారామె. సోషల్ మీడియాతో ఎదిగిన తనను.. అదే సోషల్ మీడియా అప్రతిష్టపాలు చేస్తుందని ఊహించలేదని మంగ్లీ కన్నీరు పెట్టున్నారు. కాస్త ఎమోషనల్ అవుతూనే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌తో సంబంధం లేదని మంగ్లీ కుండబద్దలు కొట్టారు. అడ్వకేట్ సుబ్బారావు సెలెబ్రిటిగా మారాలి అని టార్గెట్ పెట్టుకున్నారు. ఫేమస్ అవ్వడమే తన లక్ష్యమని మంగ్లీ ఆరోపించారు. శ్రీముఖి అంటే క్రష్ అని చెప్పాడని మంగ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా ద్వారా ఫేమస్ అయి బిగ్‌బాస్ లోకి వెళ్ళాలి సుబ్బారావు అనుకుంటున్నాడని అన్నారు. అందుకే నన్ను ఇలా ఇరికించాలని ప్రయత్నిస్తున్నాడు అంటూ మంగ్లీ ఎమోషనల్ అయ్యింది. మంగ్లీ చెప్పింది నిజమైతే.. మరి స్కీమ్ పేరుతో జరిగిన స్కామ్‌లో ఉన్నదెవరు? పైసా వసూల్ డైరెక్షన్ ఎవరిది? వీడియోలో కన్పిస్తోన్న డబ్బంతా ఎవరి చేతుల్లోకి వెళ్లిపోయింది? మంగ్లీ ఆరోపిస్తున్నట్టు ఫేమ్ అయ్యేందుకే అడ్వకేట్ సుబ్బారావు ఇంత హంగామా చేస్తున్నారా అన్నది పోలీసుల విచారణలోనే తేలాలి. ఏది ఏమైనా మంగ్లీ వ్యవహారం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్ మారింది.

## ఆర్టీసీ సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

**కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**




**కరీంనగర్,తెలంగాణ దిశ :**ఆర్టీసీ కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు భారతీయ జనతా పార్టీ పూర్తిమద్దతు ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్ర తినిధి,కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపా రు. సమ్మెశిబిరాన్ని సందర్శించిన ఆయన, కార్మికులను కలిసి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజ మాన్యంపై ఆయన తీవ్రంగా విమర్శలు గుప్పించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం బేషరతుగా వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికు లకు టెంట్ వేసుకునే అనుమతి కూడా ఇవ్వకపోవడం యాజమాన్యం మొండితనం, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు బీజేపీతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కార్మికుల పక్షాన నిలుస్తారని భరోసా ఇచ్చారు. సమ్మె శిబిరంలో కార్మికులు తమ సమస్యలను సునీల్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మహిళా కార్మికులు పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిందని, కుటుంబ కార్యక్రమాలకు కూడా హాజరుకాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవ డం శోచనీయమని, ఇప్పటికైనా మొండివైఖరి వీడి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సునీల్ రావు కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసీ కార్మికులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ల వ్యవస్థ ముగింపేనా..!



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** వాలంటీర్ వ్యవస్థ.. వైసీపీ హయాంలో పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు వైసీపీ ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ వ్యవస్థ. ఈ వాలంటీర్ సిస్టమ్‌ను వైసీపీ దుర్వినియోగం చేసిందన్నదానిపైనే ఏపీ ఎన్నికల వేళ పెద్దఎత్తున చర్చ జరిగింది. వాలంటీర్ల సెంట్రిక్‌గానే ఎలక్షన్ ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలో కూటమి వాలంటీర్లపై అప్పట్లోనే సీరియస్ కామెంట్స్ చేసింది. ఇక పవర్‌లోకి వచ్చాక వాలంటీర్ల ముచ్చటే తీయకుండా సున్నితంగా ఆ సిస్టమ్‌కు చెక్ పెట్టగలిగింది.వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని అప్పట్లో సర్పంచ్‌లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా క్లియర్ కట్ క్లారిటీ ఇచ్చేశారాయన. అసలు వా ళు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చని, కానీ అసలు వ్యవస్థలోనే లేరని చెప్పేశారు. దీంతో కూటమి సర్కార్ వాలంటీర్ వ్యవస్థకు మంగళం పాడినట్లేనని విమర్శించింది వైసీపీ. తాము లక్షల మంది వాలంటీర్లను పెట్టి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేస్తే కూటమి సర్కార్ ప్రజలను ఇబ్బంది పెడుతోందని అటాక్ చేసింది. అయితే ఇప్పుడు వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థపై యూటర్న్ తీసుకుంది. అప్పుడు జరిగిన డ్యామేజ్‌ను కవర్ చేసుకునేందుకు క్యాడర్ మనసు గెలుచుకునేందుకు సరికొత్త స్టేట్‌మెంట్స్‌తో ఇండికేషన్స్ పంపిస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి వాలంటీర్ వ్యవస్థే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ మధ్య కామెంట్స్ చేశారు. పాలనలో ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎటువంటి ప్రాధాన్యం లేకపోవడంతో ప్రజలకు దూరమై, ఓడిపోయామన్నారు. వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరిగి, వైసీపీకి నష్టం జరిగిందన్నారు గుడివాడ. ఈ సమస్యను అధినేత జగన్ కూడా గుర్తించారని, మరోసారి ఇటువంటి పొరపాటు జరక్కుండా చూసుకుంటారని చెప్పారు. 2029 ఎన్నికల తర్వాత మళ్లీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చే ప్రసక్తే ఉండదని, అధినేత జగన్ కూడా ఈ విషయమై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి తేల్చిచెప్పారు.ఏపీలో 2019 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను పెట్టి వారి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు దగ్గరయ్యేలా చేసింది. దీంతో ప్రజలకు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు మధ్య దూరం పెరిగిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. వాలంటీర్లకు ప్రాధాన్యం ఇవ్వడంపై వైసీపీ క్యాడర్ హర్ట్ అయిందని పార్టీకి, కార్యకర్తల మధ్య ఎమోషనల్ గ్యాప్ వచ్చిందన్న టాక్ ఉండేది. అందుకే 2019 ఎన్నికలకు ముందు కష్టపడి పనిచేసిన కార్యకర్తలు 2024కు వచ్చేసరికి డీలా పడిపోయారని అంటుంటారు.ఇప్పటివరకు ప్రచారంలో ఉన్న ఈ వాస్తవాలను ఇప్పుడు వైసీపీ కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. దీంతో వాలంటీర్ వ్యవస్థను తెచ్చి మళ్లీ పాత తప్పు చేయకూడదని వైసీపీ డిసైడ్ చేసుకున్నట్లు చెబుతున్నారు. గుడివాడ అమర్‌నాథ్ కామెంట్స్‌ను బట్టి చూస్తే..ఏపీలో వాలంటీర్ వ్యవస్థ పూర్తిగా ముగిసిన అధ్యాయమేనన్న క్లారిటీ వచ్చేసింది. తెరమరుగైన వాలంటీర్ల వ్యవస్థను తిరిగి కొనసాగించే అవసరం, అవకాశమే లేదని వైసీపీ నేతలు కూడా డిసైడ్ కావడంతో వాలంటీర్ వ్యవస్థ చరిత్రగానే మిగిలిపోనుంది. వైసీపీ ఇచ్చిన క్లారిటీతో కూటమికి పాజిటివ్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మళ్లీ పవర్‌లోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను తెస్తామని వైసీపీ చెప్తే గనుక అదీ మళ్లీ ఎలక్షన్ ఎజెండాగా మారే అవకాశం ఉంటుంది. వాలంటీర్లు లక్ష మంది వరకు ఉంటారు. పైగా వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పుడు ప్రజలకు నేరుగా సేవలు అందాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ వాలంటీర్ వ్యవస్థను తీసుకొస్తామని వైసీపీ చెప్పినా..వాలంటీర్లకు ఎన్నికల ముందు కూటమి ఇచ్చినా హామీలను గుర్తు చేసినా..పొలిటికల్ ఫైట్‌కు దారితీసేది. కానీ వైసీపీనే వాలంటీర్ వ్యవస్థకు మంగళం అని చెప్పేదయం పొలిటికల్ ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది.

## మట్టి'మనుషులకు చట్టసభల్లో చోటేది?



**కరీంనగర్,తెలంగాణ దిశ:**తెలంగాణ జనాభాలో కుమ్మరి/శాలివాహ న సామాజికవర్గం వాటా 1.2 శాతం ఉన్నందున దామాషా పద్ధతి ప్ర కారం.. కనీసం 1 నుంచి 2 ఎమ్మెల్యే సీట్లు ఆ వర్గానికి దకాలి. 17 ఎంపీ సీట్లు ఉన్నందున ఐదు లోక్‌సభ ఎన్నికలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఒక స్థానం ఉండాలి. చట్టసభల్లో నేరుగా ఎన్నికయ్యే అవకాశం లేనప్పుడు నామినేటెడ్ కోటాలో శాసనమండలిలో కనీసం ఒక సీటు అయినా కేటాయించి వారి రాజకీయ శూన్యత్వాన్ని భర్తీ చేయాలి. కానీ, రాష్ట్రం లో 4,31,363 (1.2 శాతం) జనాభా ఉన్న కుమ్మరి సామాజికవర్గా నికి చట్టసభల్లో ఒక సీటు కూడా దకకటం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నుంచి ఇప్పటికీ కుమ్మరి సామాజికవ ర్గం ఒక నిశ్శబ్ద ఓటుబ్యాంకుగానే మిగిలిపోయింది. ఉమ్మడి ఏపీలో 294అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ, కుమ్మరి కులస్తులకు ఎమ్మెల్యే టికెట్లు దక్కలేదు. జనాభాపరంగా బీసీ–బీ క్యాటగిరీలో ఉన్న వీరు, రాజకీయంగా బలంగా ఉన్న ఇతర బీసీ కులాల నీడలోనే ఉండిపోయారు. కాంగ్రెస్ లేదా టీడీపీ వంటి ప్రధాన పార్టీలు వీరిని కేవలం స్థానిక సంస్థల స్థాయికే పరిమితం చేశాయి. నామినేటెడ్ పదవుల్లో కూడా వీరికి దకిన వాటా నామమాత్రమే. కుమ్మరి సామాజికవర్గానికి చెందిన బలమైన నేత ఐలాపురం వెంకయ్య శాసనమండలి సభ్యునిగా ఎనిమిదేండ్లపాటు పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా తాడూరి శ్రీనివాస్‌కు కేసీఆర్ అవకాశం కల్పించారు. కుమ్మరి కులానికి ఆత్మగౌరవ భవనం కేటాయించారు. రాష్ట్రమంతటా కుమ్మరి జనాభా విస్తరించి ఉన్నది. కానీ, ఏ ఒక నియోజకవర్గంలోనూ గెలుపోటముల ను శాసించే స్థాయిలో లేదు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 94 మంది కుమ్మరి కులస్తులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా గెలిచి సత్తాచాటారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సీపెక్ డాటా గణాంకాలను పరిశీలిస్తే, సామాజికంగా, ఆర్థికంగా కుమ్మరులు నిలకడగా ఉన్నప్పటికీ రాజకీయంగా ఈ కులం తీవ్ర వివక్షకు గురవుతున్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్రం మొత్తం జనాభాలో కుమ్మరుల వాటా 1.2 శాతం. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగ్గానే ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం భూమిలో 1.4 శాతం భూమి వీరి హస్తగతమై ఉన్నది. జనాభా నిష్పత్తి కంటే ఎకువ భూమిని కలిగి ఉండి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తమదైన ముద్ర వేస్తున్నప్పటికీ, రాజకీయంగా మాత్రం వీరి గొంతు చట్టసభలకు చేరడం లేదు. కేవలం ఓటుబ్యాంకు గానే కాకుండా, చట్టసభల్లో నిర్ణయాత్మక శక్తులుగా కుమ్మరులను గుర్తించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

# వైసీపీ కిం కర్తవ్యం



**విజయవాడ,తెలంగాణ దిశ :** ప్రస్తుతం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ మీద రాజకీయ చర్చ సాగుతోంది. అధికార ఎన్డీయే తీసుకున్న విధానం పట్ల ఇండియా కూటమిలో తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు అయితే తమ సీట్లు పెద్ద ఎత్తున తగ్గి రాజకీయంగా అభివృద్ధి పరంగా ఇబ్బంది అవుతుందని కూడా ఆందోళన చెందుతున్నాయి. దక్షిణాదిలోనే ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. అయితే ఇందులో ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే లాంటివి పూర్తిగా యాంటీ స్టాండ్ తీసుకుంటే అన్నా డీఎంకే జేడీఎస్, టీడీపీ జనసేన వంటివి జై కొడుతున్నాయి. అయితే చిత్రంగా తటస్థంగా ఉన్న వైసీపీ మాత్రం డీలిమిటేషన్ మీద కేంద్రం అనుసరిస్తున్న విధానానికి అనుకూలంగా స్పందిస్తోంది. అదే సమయంలో తెలంగాణాలో ఉన్న మరో ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ అయితే బిల్లు స్వరూప స్వభావాలను చూసి మాత్రమే ఏ సంగతీ చెబుతామని అంటోంది: దేశంలో కొత్తగా సీట్లు పెరిగితే మంచిదే కదా ఎంత మంది యువతకు కొత్త వారికి అవకాశాలు వస్తాయని వైసీపీ అంటోంది. అంతే కాదు చిన్న నియోజకవర్గాల వల్ల అభివృద్ధి కూడా సాగుతుందని చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ పార్లమెంట్ సీట్ల పునర్ విభజన చేసే విధానం పట్ల సంతృప్తిగా ఉన్నామని ఆ పార్టీ నేత సజ్జల రామక్రిష్ణారెడ్డి ప్రకటించడం విశేషం. నిజం చెప్పాలీ అంటే ప్రాంతీయ పార్టీల పట్టుని దెబ్బ తీసే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండబోతోంది అని అంతా అంటున్న నేపథ్యం ఉంది. స్టాలిన్ విజయ్ వంటి ప్రాంతీయ పార్టీల నేతలు వ్యతిరేకిస్తూ వైసీపీ ఓకే చెప్పడమే అసలైన ట్విస్ట్ ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అయితే డీలిమిటేషన్ మీద ఆచీ తూచీ స్పందించారు. కేంద్రం ప్రవేశపెడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతు ఇస్తున్నట్లుగా ప్రకటించిన బీఆర్ఎస్ డీలిమిటేషన్ విషయంలో మాత్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించడం విశేషం. డీలిమిటేషన్ బిల్లులో పేర్కొన్న అంశాలు అన్నీ చూసిన మీదటనే పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ చెప్పడం విశేషం. సహేతుకంగా డిమాండ్ఇదిలా ఉంటే ప్రస్తుతం 543 ఎంపీలు దేశంలో ఉంటే సౌత్ స్టేట్స్ నుంచి 24 శాతం మంది ఎంపీల ప్రాతినిధ్యం ఉంది. ఆ శాతం తగ్గకుండా 50 శాతం సీట్లు పెంచాలని బీఆర్ఎస్ కోరుతోంది. అది కూడా 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ ఎస్ అంటోంది. మొత్తం మీద డీలిమిటేషన్ విషయంలో బీఆర్ ఎస్ నిర్మాణాత్మకంగానే వ్యవహరించాలని చూస్తోంది. అలాగే ప్రాంతీయ పరమైన అవసరాలను పరిగణనలోకి తీసుకుంటోంది. వైసీపీ మాత్రం ఎన్డీయేకు ఔట్ రేట్ గా మద్దతు ఇవ్వడమే చర్చనీయాంశంగా ఉంది.

## వంటగదికి దూరంగా రానా సతీమణి..

# అత్తమ్మ వంటపై ఆసక్తికర వ్యాఖ్యలు వైరల్!



స్టార్ హీరోల వ్యక్తిగత జీవితాలపై ప్రేక్షకుల్లో ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా వారి కుటుంబ జీవితం, రోజువారీ అలవాట్లు, ఇంటి సంస్కృతి వంటి విషయాలు బయటకు వస్తే అవి వెంటనే చర్చనీయాంశంగా మారిపోతాయి. తాజాగా హీరో రానా దగ్గుపాటి భార్య మిహికా బజాజ్ గురించి వెలుగులోకి వచ్చిన కొన్ని ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వ్యాపార కుటుంబానికి చెందిన మిహీక బజాజ్ ఓ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్. ఆమె నిర్వహిస్తున్న అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ మరియు డెకర్ సంస్థ ద్వారా మంచి గుర్తింపు సంపాదించారు. క్రియేటివిటీ, బిజినెస్ మైండ్‌తో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. అయితే ప్రొఫెషనల్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం చాలా సింపుల్‌గా ఉండటం ఆమె ప్రత్యేకత. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మిహీక తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పెళ్లికి ముందు అప్పుడప్పుడు వంట చేసేదాన్నని చెప్పిన ఆమె, పెళ్లి తర్వాత మాత్రం కిచెన్ వైపు వెళ్లాల్సిన అవసరం రాలేదని నవ్వుతూ వెల్లడించారు. దీనికి కారణం తన అత్తమ్మ వంట ప్రతిభ అని పేర్కొన్నారు. "అమ్మ చాలా బాగా వంట చేస్తారు" అని చెప్పిన ఆమె, అత్తమ్మను 'అమ్మ' అని పిలుస్తానని చెప్పడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ వ్యాఖ్యలు చూస్తే ఆమెకు అత్తమామలతో ఉన్న అనుబంధం ఎంత బలంగా ఉందో స్పష్టమవుతోంది.

ఇంకావంటల విషయానికి వస్తే, తనఅత్తమ్మ చేసిన మటన్ కర్రీ తనకు ఎంతో ఇష్టమని మిహీక తెలిపారు. తన జీవితంలో అంత రుచిగా మటన్ ఎప్పుడూ తినలేదని చెప్పడం విశేషం. సాధారణంగా సెలబ్రిటీ లు ఫిట్‌నెస్, డైట్‌లపై దృష్టి పెట్టే ఈ కాలంలో, ఇలాంటి హోమ్ ఫుడ్‌పై ఆమె చూపిన ప్రేమ అభిమానుల్లో ఆసక్తి కలిగిస్తోంది. గ్లామర్ ప్రపంచంలో ఉన్నప్పటికీ, కుటుంబ విలువలు, అనుబంధాలకు ప్రాధా న్యం ఇస్తున్న జంటగా రానా–మిహీక నిలుస్తున్నారు. వారి దాంపత్య జీవితం కేవలం స్టార్‌డమ్‌కే పరిమితం కాకుండా, సాదాసీదా కుటుంబ జీవనశైలిని ప్రతిబింబిస్తోందని చెప్పాలి.

# కేసీఆర్‌ని పొగుడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మధుప్రియ సంచలన వ్యాఖ్యలు..



తెలంగాణ జానపద గీతాలకు ప్రాణం పోసిన గాయని మధుప్రియ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి తన పాటలతో కాదు, రాజకీయ వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. జగిత్యాలలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్న ఆమె మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తన అభిమానాన్ని వ్యక్తం చేస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగిత్యాలలో జరిగిన 'కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ'లో మధుప్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభకు హాజరైన వేలాది మంది ప్రజలను ఆమె తన జానపద గీతాలతో ఉర్రూతలూగించారు. ముఖ్యంగా కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ "మళ్లీ బాపు రావాలి.. మళ్లీ కేసీఆర్ పాలన రావాలి" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సభ అనంతరం మీడియాతో మాట్లాడిన మధుప్రియ, "ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అంటే ఒక ఎమోషన్. రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను ఎవరూ చెరిపివేయలేరు" అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఇక ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతుల సమస్యలు పెరిగాయి. కూల్చివేతలు ఎక్కువయ్యాయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే తెలంగాణ బాగుంది. అందుకే మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలి" అని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే "నేను ఎప్పుడూ కేసీఆర్ పక్షమే ఉంటాను. రేవంత్ రెడ్డి అడిగినా కూడా నేను వారి కోసం పాటలు పాడను" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధుప్రియ ప్రస్థానం విషయానికి వస్తే, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఆమె చిన్న వయసులోనే జానపద గీతాలతో మంచి గుర్తింపు సంపాదించారు. 'ఆడపిల్లనమ్మ నేను ఆడపిల్లనాని' పాటతో తెలుగు రాష్ట్రాల్లో ఓవర్‌నైట్ స్టార్‌గా మారారు. ప్రజాకళాకారుడు గద్దర్‌తో వేదికలు పంచుకోవడం ఆమెకు మరింత గుర్తింపునిచ్చింది. తరువాత సినీరంగంలోకి అడుగుపెట్టి పలు సూపర్ హిట్ పాటలతో తన ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా 'వచ్చిందే' పాటతో ఆమె కెరీర్‌కు కీలక మలుపు వచ్చింది. ఆ తర్వాత అనేక సినిమాల్లో పాటలు పాడుతూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అలాగే బిగ్ బాస్ సీజన్-1లో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. ఇటీవల కాళేశ్వర ఆలయంలో పాట చిత్రీకరణ వివాదంతో కూడా వార్తల్లో నిలిచిన ఆమె, ఇప్పుడు రాజకీయ వ్యాఖ్యలతో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు.

# నటనలో దిట్ట.. సంస్కారంలో సున్నా

## ప్రకాశ్ రాజ్‌పై నటుడు నాగ మహేశ్ విమర్శనాస్త్రాలు..!


వెండితెరపై నవరసాలను పండించే ప్రకాశ్ రాజ్, నిజ జీవితంలో మాత్రం కేవలం 'విద్వేషం' అనే రసాన్నే నమ్ముకున్నారని నటుడు నాగ మహేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "జస్ట్ ఆస్కింగ్" అంటూ ప్రశ్నించే నెపంతో ఆయన హిందూ ధర్మాన్ని, కోట్లాది మంది ఆరాధ్య దైవమైన శ్రీరాముడిని కించపరచడం హేయమని మండిపడ్డారు. ప్రకాశ్ రాజ్ తన తల్లి నమ్మకాన్ని గౌరవిస్తూ చర్చికి వెళ్లినప్పుడు అందరూ ఆయన్ని సంస్కారవంతుడిగా చూశారని, కానీ అదే వ్యక్తి శ్రీరాముడిని అవహేళన చేసినప్పుడు ఆయనలోని సంకుచిత బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు. నాస్తికత్వం అంటే దేవుడిని నమ్మకపోవడం మాత్రమే కానీ... ఇతరుల నమ్మకాలను కించపరచడం కాదని హితవు పలికారు. లక్ష్మణుడిని రాముడు 'లక్కీ' అని పిలుస్తాడని, రావణుడి తోటలో పండ్లు దొంగిలించారని, దానికి శూర్పణఖ జీఎస్టీతో బిల్లు వేసిందంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వెకిలి వ్యాఖ్యలు ఆయన ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఎండగట్టారు. రాముడు ఉత్తరాది వాడని, రావణుడు దక్షిణాది వాడని ప్రకాశ్ రాజ్ చేస్తున్న ప్రచారం ప్రాంతీయ విద్వేషాలను రగిల్చే కుటిల ప్రయత్నం అని విమర్శించారు. ప్రధాని మోదీ, బీజేపీపై ఉన్న వ్యక్తిగత వ్యతిరేకతను ప్రకాశ్ రాజ్



ఒక మతంపై ద్వేషంగా మార్చుకుంటున్నారని, ఇది ఆయన వినాశనానికే దారితీస్తుందని నాగ మహేశ్ హెచ్చరించారు.


# సినిమా

# ప్రియుడి దర్శకత్వంలో సినిమా?



సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటుంది అగ్ర కథానాయిక శ్రద్ధాకపూర్. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ పాత్రల పరంగా కొత్తదనానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర నృత్య కళాకారిణి విఠాబాయి బయోపిక్ 'ఈతా'లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో భారీ ప్రాజెక్ట్‌ను అంగీకరించింది. అమీర్‌ఖాన్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని భారత్ పే మనీ రూపకర్త అశ్నీర్ గ్రోవర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించబోతున్నారు. విశేషమేమిటంటే.. శ్రద్ధాకపూర్ ప్రియుడిగా ప్రచారంలో ఉన్న ప్రముఖ దర్శకుడు, రచయిత రాహుల్ మోడీ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా రాహుల్ మోడీ తీసుకున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించిన 'తూ ఝూతీ మే మక్కర్' చిత్రానికి రాహుల్ మోడీ రచయితగా పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని తెలిసింది. గత రెండేళ్లుగా రాహుల్ మోడీతో శ్రద్ధాకపూర్ ప్రేమలో ఉందని బాలీవుడ్ టాక్. ప్రియుడి దర్శకత్వంలో సినిమా కావడంతో శ్రద్ధాకపూర్ ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని సమాచారం. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# ఆ వివాదంపై క్లారిటీ ఇచ్చిన సాయి పల్లవి..



తెలుగు, తమిళ సినీ ఇండస్ట్రీల్లో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మకమైన రామాయణ సినిమాలో సీత పాత్రలో నటిస్తూ బిజీగా ఉన్న ఆమె, తాజాగా నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సాయి పల్లవి మాట్లాడుతూ... సుమారు నాలుగేళ్ల క్రితం తాను ఒక ప్రెస్ మీట్‌లో పాల్గొన్న సందర్భాన్ని వివరించారు. ఆ సమయంలో ఒక రిపోర్టర్ "మీ మలయాళ నటీనటులు తమిళం ఇంతబాగా ఎలా మాట్లాడతారు?" అని ప్రశ్నించారని చెప్పారు. దానికి తాను "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని నిజం చెప్పానని తెలిపారు. అయితే ఆ సమాధానం తర్వాత పరిస్థితులు ఎలా మారాయో చెప్పుకుంటూ సాయి పల్లవి బాధ వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల తర్వాత ఒక పత్రికలో "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అనే హెడ్‌లైన్ చూసి తాను షాక్‌కు గురయ్యానన్నారు. తన మాటలను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేయడం బాధ కలిగించిందని వెల్లడించారు. మరో సందర్భాన్ని కూడా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒక మహిళ తనతో మలయాళంలో మాట్లాడిన తర్వాత మీకు కోపం వస్తుందేమో" అని చెప్పడంతో తాను ఆశ్చర్యపోయానన్నారు. వెంటనే "నాకు అలాంటి భావం ఎప్పుడూ లేదు అని చెప్పినా, ఆమె నమ్మలేదని తెలిపారు. ఈ సంఘటనలు తనను చాలా బాధపెట్టాయని, తాను చెప్పని విషయాలు తనపై మోపడం సరైంది కాదని అన్నారు. భాషల విషయానికి వస్తే తాను ఎప్పుడూ ఎలాంటి బేధాలు చూపనని సాయి పల్లవి స్పష్టం చేశారు. నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. దానిని తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను ఎప్పుడూ ఏ భాషనూ చిన్నచూపు చూడను అని క్లారిటీ ఇచ్చారు. అలాగే తాను తమిళనాడులోని కోయంబత్తూరులో పుట్టి పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే తన మాతృభాష తమిళమని చెప్పానని, అంతేకాని ఇతర భాషలను తిరస్కరించే ఉద్దేశం ఎప్పుడూ లేదని తెలిపారు. ప్రస్తుతం సాయి పల్లవి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె ఇచ్చిన వివరణతో గతంలో వచ్చిన వివాదానికి పూర్తి స్థాయిలో క్లారిటీ వచ్చిందని అభిమానులు భావిస్తున్నారు.

# బాలయ్య సినిమా నుండి నయనతార ఔట్ కాజల్ ఎంట్రీకి రంగం సిద్ధం?

నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. అఖండ , వీరసింహారెడ్డి , భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో ఆయన స్టార్‌డమ్ మరింత పెరిగింది. ఈ వయసులో కూడా యంగ్ హీరోలకు పోటీగా వరుస సినిమాలను లైన్‌లో పెట్టడం బాలయ్య ప్రత్యేకతగా మారింది. ఇలాంటి సమయంలోనే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో బాలకృష్ణ మరోసారి జతకట్టడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన "వీరసింహారెడ్డి" భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో NBK 111" పేరుతో మరో ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. ఈచిత్రం పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్. 1960-70ల కాలంలోనిముంబై నేపథ్యంతో పాటు చారిత్రక అంశాలను మేళవిస్తూ దర్శకుడు పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు తమన్ మరోసారి బాలయ్య సినిమాకు సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎంపిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొదట లేడీ సూపర్ స్టార్ నయనతారను ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేసినట్లు వార్తలు వచ్చాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215